క్లుప్తంగా

రేషన్ పంపిణీలో ఉదాసీనత వద్దు

తిరువూరు ఆర్డీఓ మాధవి



తిరువూరు: చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు నిత్యావసర సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధవి పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌పీ క్యాంపులోని పౌర సరఫరాల మండల స్థాయి గోదాములను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కాల పరిమితిలోపు సరుకులను గోదాము నుంచి దుకాణాలకు తరలించాలని, ఎండీఎస్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి నిత్యావసర సరుకులను కార్డుదారులకు అందించాలని ఆదేశించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచే పంపిణీ ప్రారంభం కావాలని తెలిపారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ ఉన్న సరుకుల వివరాలను పరిశీలించారు.

దుకాణదారులకు పోలీసుల నోటీసులు

తిరువూరు: జూన్ 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు బంద్ చేయాలని తిరువూరు పోలీసులు నోటీసులు జారీచేశారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు 144 సెక్షన్, 30 పోలీసు చట్టం అమలులో ఉంటుందని, దుకాణాల వద్ద గుమిగూడటం, రాజకీయ చర్చలు జరపడం చేయరాదని పోలీసులు ఆదేశించారు. పట్టణంలోని అన్ని దుకాణాలకు నోటీసులు అందజేశారు.

మజ్జిగ పంపిణీ



వెల్వడం(మైలవరం): వెల్వడం గ్రామంలోని లకిరెడ్డి పాపులమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశామని విద్యార్థి సంఘ నాయకుడు గూడూరు నాగిరెడ్డి తెలిపారు. లకిరెడ్డి పాపులమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–1992 సంవత్సరాలలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బొగ్గుల వెంకట శ్రీనివాసరెడ్డి (యూఎస్ఏ) సతీమణి కృష్ణవేణి సహకారంతో మజ్జిగ పంపిణీ చేశామన్నారు. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోయ సుధ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 196 మంది హాజరు

నూజివీడు: డివిజన్‌లోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ సోషల్ పరీక్షకు 196 మంది విద్యార్థులు హాజరయ్యారని డీవైఈఓ ఎం. సేవియా తెలిపారు. మొత్తం 470 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 196 మంది పరీక్షలు రాశారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 124 మందికి గానూ 42 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ కేంద్రంలో 93 మందికి గానూ 46 మంది, ముసునూరు హైస్కూల్‌లో 100 మందికి గానూ 42 మంది, చాట్రాయి హైస్కూల్ లో 47మందికి గానూ 19 మంది, ఆగిరిపల్లి హైస్కూల్ సెంటర్‌లో 106 మందికి గానూ 47 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

గోశాల నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణానికి భక్తుడు శుక్రవారం రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్ వాస్తవ్యులు దివంగత కొమ్ము బసవయ్య నాయుడు, హైమావతి దంపతుల కుమార్తె శేషదుర్గ, శ్రీధర్ దంపతులు ఈ మొత్తాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ జయప్రకాష్ బాబుకు అందజేశారు. అర్చకులు దాత దంపతులను ఆశీర్వదించారు.

78 మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు: అక్రమంగా మద్యం సీసాలను కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 78 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని నూజివీడు సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ తెలిపారు. సెబ్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నూజివీడు మండలం తూర్పు దిగవల్లికి చెందిన పామర్తి రాంబాబు వద్ద విస్కీ సీసాలు 30, చాట్రాయి మండలం కోటపాడుకు చెందిన ఎం.లక్ష్మీ వద్ద బ్రాందీ సీసాలు 48 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని చెప్పారు.

అభివృద్ధి పథంలో కొటికలపూడి పంచాయతీ

- రూ.3.50 కోట్లతో మౌలిక సదుపాయాలు
- రూ.22.83 కోట్లతో సంక్షేమం
- గోడౌన్ నిర్మాణంతో రైతులకు అందుబాటులో విస్తృత సేవలు



కొటికలపూడి గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

ఇబ్రహీంపట్నం: గడిచిన ఐదేళ్ల కాలంలో కొటికలపూడి గ్రామాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపింది. సుమారు 2,500 జనాభా కలిగిన గ్రామంలో రూ.3.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయం వంటి మౌలిక సదుపాయాలు కల్పించింది. రూ.22,83,56,839 నగదును నేరుగా వివిధ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసి ఆర్థిక వెసులుబాటు కల్పించింది. వీటితో పాటు ఇళ్లు లేని నిరుపేదలకు రూ.150 స్థలాలు జగనన్న కాలనీలో కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వ్యవసాయ ఆధారిత గ్రామంగా ఉన్న రైతులకు రైతు భరోసా కేంద్రంతో పాటు ఉద్యాన శాఖ, వరల్డ్ విజన్ సంస్థ, రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయ గోడౌన్ నిర్మించి విస్తృత సేవలు అందించారు.

రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులు

కొటికలపూడిలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి పనులు జరిగాయి. నాడు– నేడు పథకంలో సుమారు రూ.60 లక్షలతో పాఠశాల అభివృద్ధి, మరుగుదొడ్లను నిర్మించారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో ఇంటింటి కుళాయి ఏర్పాటుకు పైపులైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.50 లక్షలతో సిమెంట్ డ్రెయినేజీలు, రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశారు. రూ.40 లక్షలతో సచివాలయం, రూ.24.30 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, ఉద్యాన శాఖ, వరల్డ్ విజన్,



కొటికలపూడిలోని వ్యవసాయ గోడౌన్

రైతులు కలిసి రూ.20 లక్షలతో వ్యవసాయ గోడౌన్ నిర్మించారు. ఎంపీపీ, 14, 15 ఆర్థిక సంఘం నిధులు సుమారు 40 లక్షలతో డ్రెయిన్లు, సీసీ రోడ్లు నిర్మించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు.

సచివాలయాలతో పారదర్శక పాలన

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు పాలనా సౌలభ్యం చేకూరింది. మండల కేంద్రానికి సుమారు 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో గతంలో వివిధ రకాల సర్టిఫికెట్లు, ఎరువులు, విత్తనాలు, ఆరోగ్య సమస్యలపై మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉండేది. ఈ విధానం వ్యయప్రయాసలతో పాటు రెండు, మూడు రోజులు పనులు పోగొట్టుకుని ఆర్థికంగా నష్టపోయే వారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పరిధిలో ఏ పని కావాలన్నా గ్రామంలో అందుబాటులో ఉంటున్నాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో అర్హుల గుర్తింపు ఇళ్ల వద్దనే జరుగుతోంది. ఏ పని కావాలన్నా సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండటంతో క్షణాల్లో జరుగుతోంది. ఈ విధానంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వర్గాలకు డీబీటీ ద్వారా సంక్షేమం

జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్న పథకాల్లో భాగంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలకు డీబీటీ ద్వారా ఆర్థిక చేయూత అందించారు. జగనన్న విద్యా



కొటికలపూడిలోని గ్రామ సచివాలయం భవనం

దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, పింఛన్ కానుక, జగనన్న చేదోడు, వాహన మిత్ర తదితర ప్రభుత్వ పథకాలు అవినీతికి తావు లేకుండా నేరుగా బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.22,83,56,839 నగదు అందించి ఆర్థిక పరిపుష్టి కల్పించారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా సంక్షేమ పథకాలను ప్రజలు అందుకున్నారు.

జగనన్న ప్రభుత్వంలో గ్రామం అభివృద్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించింది. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు గ్రామ ప్రజలకు స్థిరాస్తులుగా నిలిచాయి. మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే గ్రామం మరింత అభివృద్ధి సాధిస్తుంది. ప్రజలకు సంక్షేమం అందుతుంది.

– రెంటపల్లి నాగరాజు, సర్పంచి, కొటికలపూడి

కలుషితం లేని తాగునీరు సరఫరా



గంపలగూడెం: గంపలగూడెంలో పంచాయతీ ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు నిర్దేశిత ప్రమాణాల్లోనే ఉందని, నీటిలో ఎలాంటి కలుషితం లేదని పంచాయతీ ఈఓ జి. శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రామంలో భూగర్భ జలవనరుల శాఖ, పంచాయతీ సరఫరా చేస్తున్న అన్ని నీటి వనరులను ఉన్నతాధికారుల ఆదేశానుసారం పరీక్షించామని ఆయన చెప్పారు. ఎస్సీ, బీసీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, తూర్పు పడమట దళితవాడలు, రామాలయం ఏరియాలోని నీటి సరఫరాకు వినియోగిస్తున్న బోరుబావుల్లో నీటి శాంపిల్స్‌ను సేకరించిన ఇంజినీరింగ్ సహాయకులు గోపాలకృష్ణ, నాగేశ్వరరావులు తగిన పరీక్షలు చేశారన్నారు. నీటిలో ఎలాంటి కలుషితం లేదన్నారు. ఫ్లోరైడ్ తగిన శాతంలోనే ఉందని చెప్పారు. రక్షిత మంచినీటి సరఫరా ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకు ఒక సారి సిబ్బందిచే శుభ్రం చేస్తున్నామన్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

తిరువూరు సీఐ అబ్దుల్ నబీ



తిరువూరు: జూన్ 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో గుర్తింపు కార్డులు కలిగిన ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, కౌంటింగ్ కేంద్రంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. ఎటువంటి వివాదాలు, అల్లర్లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ఎన్నికల నియమావళి మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

జి.కొండూరు: స్థానిక నర్సింహస్వామి గట్టుపై ఉన్న సువర్చల సమేత అభయాంజనేయ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న కల్యాణోత్సవంలో భాగంగా మొదటి రోజు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై అఖండ దీప ప్రజ్వలన, వార్షికోత్సవ సంకల్పం, అష్టోత్తర శత కలశ పూర్వక దేవతా అవాహన, మండప పూజలు, స్వామివారికి విశేష అభిషేకం, అర్చన, నీరాజన మంత్రపుష్పములు, నవగ్రహ సహిత సకల దేవతా మూల మంత్ర, మన్యుపాశుపత హోమాలు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

గుళ్లపూడి సొసైటీ అధ్యక్షుడు పోట్రు శశాంక్

గంపలగూడెం: బ్యాంకుల ద్వారా వ్యవసాయ అవసరాలకు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని గంపలగూడెం మండలం గుళ్లపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు పోట్రు శశాంక్ అన్నారు. సొసైటీలో వరుసగా ఐదో సంవత్సరం రైతుల రుణాలు నూరు శాతం వసూలయ్యాయి. ఈ సందర్భంగా గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శశాంక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చేపడుతున్న పలు పథకాలతో ఆర్థిక వెసులుబాటు కలిగి రైతులు రుణాలు చెల్లిస్తున్నారన్నారు. రైతులు అధిక వడ్డీ భారిన పడకుండా, ప్రైవేటు వ్యాపారుల చేతుల్లో నలిగి పోకుండా సొసైటీల ద్వారా వ్యవసాయ అవసరాలకు అవసరమైన రుణాలను సకాలంలో అందజేస్తోందన్నారు. కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ద్వారా



శశాంక్‌కు అభినందన పత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

దీర్ఘకాలిక, స్వల్పకాలిక, రైతు నేస్తం ఇతర రుణాలు కలిపి రూ.15 కోట్లు పంపిణీ చేయగా నూరు శాతం వసూలయ్యాయని చెప్పారు.

రుణాల వసూలుకు కృషి చేసిన సొసైటీ అధ్యక్షుడు పోట్రు శశాంక్, సీఈఓ శ్రీనివాసరావులకు అభినందన పత్రం అందజేశారు. మేనేజర్ కనకదుర్గ, సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ధూమపానం మాని ఆరోగ్యంగా ఉండండి

డాక్టర్ మామిడి సీతారామారావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పొగాకు ఉత్పత్తులతో ధూమపానం సేవించే వారి మరణాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయని ప్రముఖ వైద్యులు, సర్జన్ మామిడి సీతారామారావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొండపల్లి మోహనరావు మెమోరియల్ వైద్యశాలలో అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి ఐదుగురిలో ఒకరు పొగతాగుతున్నారన్నారు. వీరిలో 20–25 ఏళ్ల ఆయుష్షు తగ్గుతుందన్నారు. ప్రతి రోజు 10 వేల మంది ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె వ్యాధులతో మృతి చెందుతున్నారని చెప్పారు. సిగరెట్ల కంటే బీడీల్లో తారు, నికోటిన్ తదితర విష పదార్థాలు అధికంగా



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మురళీమోహన్

ఉన్నట్లు పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తులు మానేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులు, వాటి వలన కలిగే అనర్థాలపై కరపత్రాలు ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వి.మురళీమోహన్, పి.కామేశ్వరరావు, నాగరాజు, సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

తిరువూరు: ప్రభుత్వోద్యోగులు అంకితభావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎస్‌కే రేష్మాబేగం అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో చౌటపల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన కూరపాటి పద్మావతికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పద్మావతి నిబద్ధతతో, నిజాయతీతో 27 ఏళ్లు పనిచేసి వైద్య, ఆరోగ్య శాఖకు వన్నె తెచ్చారని రేష్మాబేగం అన్నారు. చౌటపల్లి, ఎ.కొండూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు పూజిత, భవానీ, వైద్య సిబ్బంది రమణ, కేవీఎస్ మూర్తి, ఆశాబీ,



తిరువూరులో వైద్య శాఖ ఉద్యోగి పద్మావతిని సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

ఎన్వీ ప్రసాద్, శ్రీనివాస్, ప్రత్యూష తదితరులు పద్మావతిని శాలువాలతో సత్కరించారు.

హాస్టల్ వార్డెన్ నజీర్ దంపతులకు సన్మానం

ముసునూరు: ఉద్యోగ బాధ్యతల అనంతర జీవితం ఆనందమయంగా గడపాలని నూజివీడు బీసీ సహాయ సంక్షేమ అధికారి రవిప్రసాద్ ఆకాంక్షించారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ముసునూరు బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ దంపతులను విశ్రాంత వార్డెన్, వార్డెన్ల సంఘ మాజీ నాయకుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నజీర్ దంపతులను బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, హాస్టల్స్ వార్డెన్లు, సిబ్బంది ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలు, జ్ఞాపికలను అందించారు.



వార్డెన్ నజీర్ దంపతులను సన్మానిస్తున్న బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు, సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పంట కాలువ రోడ్డు ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట కాలువ రోడ్డు, అమేజ్ పార్క్స్ ఏరియా, హరిహర హైట్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, ఇమేజెస్ డెకరేటివ్ పెయింట్స్ ఏరియా, దుర్గాంబిక ఫ్లాట్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- **నూజివీడు:** మండలంలోని అన్నవరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎమ్మార్ అప్పారావు కాలనీ, అన్నవరం, హనుమంతులగూడెం, వెంకటాద్రిపురం, ఓగిరాల తండా, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాల అమ్మకంలో డీలర్లు నిబంధనలు పాటించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. శుక్రవారం మండలంలోని విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. నాణ్యత లేని విత్తనాల అమ్మకం, గరిష్ఠ ధర కంటే అధికంగా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. విక్రయించిన విత్తనాలకు రశీదు ఇవ్వాలని, రైతులు రశీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. పంట చేతికి వచ్చేవరకు రశీదులు ఉండాలని, ఏదైనా కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని, బయటి మార్కెట్లో అనధికారికంగా కొనుగోలు చేస్తే నష్టపోతారన్నారు.

- **విస్సన్నపేట:** వ్యవసాయ శాఖ అనుమతులు లేని కంపెనీల విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదని, అటువంటివి విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక విత్తనాల విక్రయ దుకాణాలలో స్టాక్, రికార్డులను ఏఓ శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సాగు విత్తనాలను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. ప్రతి



విస్సన్నపేటలోని దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ రాజ్యలక్ష్మి



తిరువూరులో విత్తన దుకాణ రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ పద్మ

కొనుగోలుకు రైతులకు బిల్లు ఇవ్వాలని చెప్పారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన మినీ వ్యాన్

ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

తిరువూరు: స్థానిక ఫ్యాక్టరీ సెంటర్ సమీపంలో నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్డులో ఒక మినీ వ్యాన్ డ్రైవరు నిర్లక్ష్యంగా వాహనం నడిపి డివైడర్‌ను ఢీకొట్టాడు. రాజుపేటలోని పాత ఇనుప సామాను, చెత్త కొనుగోలు చేసే దుకాణానికి చెందిన ఈ వ్యానులో ఉన్న ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు స్థానికులు తెలిపారు. రవాణా శాఖ అనుమతులు లేకుండా, డ్రైవింగ్ లైసెన్సు లేని వ్యక్తులు పట్టణంలో వాహనాలు యథేచ్ఛగా నడుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

గంపలగూడెం: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామని మండలం వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ తెలిపారు. మండలానికి 250 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల పిల్లిపెసర, 290 క్వింటాళ్ల జనుము విత్తనాలను ఉన్నతాధికారులు మొదటి విడతగా సరఫరా చేశారని చెప్పారు. వీటిని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. కావాల్సిన రైతులు తమ భూములకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పొందవచ్చన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

తిరువూరు: స్థానిక విజయవాడ రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ సంకా రాజారావు తెలిపారు. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, లక్ష్మీ గణపతి సహిత ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, అనంతరం పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, విశేషాలంకరణ, సహస్ర నామార్చన, 58 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి ఆవుపాలతో అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ఇబ్రహీంపట్నం: బయటి మార్కెట్‌లో ప్రైవేట్ వ్యక్తులు రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టాలని చూస్తున్నారని, వీటిని అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు అధికారులను కోరారు. ఇబ్రహీంపట్నం సీపీఎం కార్యాలయంలో రైతులకు విత్తన పంపిణీపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు వీరభద్రం, ఆలీబాబా, విఠల్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి

ముసునూరు: డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా అభిమానుల హృదయాల్లో నిలిచిన సూపర్‌స్టార్ కృష్ణ సదా స్మరణీయుడని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కూసం మార్కండేయులు, సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చెక్కపల్లి సెంటర్‌లో దివంగత కృష్ణ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అభిమానులు, పౌరాణిక నాటక కళాకారులు కృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్రీనివాస్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

నూజివీడు: హనుమత్ జయంతి సందర్భంగా హనుమాన్ సేన ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ ఏర్పాటు చేశామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న కోదండ రామాంజనేయస్వామి వారి ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.